ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శనివారం 1 మార్చి 2025





నిరుపయోగంగా మారిన రైతుబజార్‌లోని షెడ్లు

నడక దారిలో కూర్చున్న రైతులు

ఆర్భాటమే మిగిలింది..

- రైతు బజార్ తీరుపై జిల్లా ప్రజల్లో అసంతృప్తి
- బల్దియా నిర్లక్ష్యం.. కొనసాగని వ్యాపారాలు
- నిర్వహణపై దృష్టి సారించని మున్సిపల్ అధికారులు
- జిల్లా కేంద్రంలో 2.14 ఎకరాల్లో రైతుబజార్ నిర్మాణం
- రూ.5.15 కోట్లతో ఆధునిక హంగులు, సౌకర్యాలు
- ఐదేళ్లు కావస్తున్నా వినియోగంలోకి రాని మాంసం దుకాణాలు
- నిరుపయోగంగానే రైతుల కూరగాయల విక్రయ షెడ్లు

● రూ.5.15 కోట్లతో రైతుబజార్ నిర్మాణం

రైతులు పండించిన కూరగాయలు నేరుగా అమ్ముకోవడం ద్వారా దళారుల ప్రమేయం తగ్గి కష్టానికి ఫలితం పొందుతారని భావించి సిరిసిల్లలో 2.14 ఎకరాల స్థలంలో రూ.5.15 కోట్లతో ఆధునిక హంగులు, సౌకర్యాలతో ప్రత్యేక ఆకర్షణగా రైతు బజార్ నిర్మించారు. తెలంగాణలోనే మోడల్‌గా సిరిసిల్లలో నిర్మించిన రైతుబజార్‌ను పరిశీలించడానికి వివిధ ప్రాంతాల వారు సైతం వచ్చి చూసివెళ్లడం గమనర్హం. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థకు చెందిన 2.14 ఎకరాల స్థలాన్ని మాజీ మంత్రి కేటీఆర్ సెస్ పాలకవర్గాన్ని ఒప్పించి వారికి మరోచోట స్థలాన్ని కేటాయించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రైతు బజార్‌ను సిద్ధం చేశారు. కానీ అనుకున్న లక్ష్యం నేరవేరక ఆర్భాటమే మిగిల్చింది.

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లా కేంద్రంలో ఆధునిక హంగులతో నిర్మించిన రాష్ట్రంలోని తొలి మోడల్ రైతు బజార్ ఆర్భాటానికి చిహ్నంగా మిగిలింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులతో పాటు పొరుగు జిల్లాల సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల నుంచి నిత్యం కూరగాయలు సిరిసిల్లకు తీసుకవచ్చి విక్రయాలు జరుపుతుంటారు. సిరిసిల్ల గాంధీ చౌక్ వద్ద ఉన్న పాత మార్కెట్ ఇరుకుగా ఉండి రైతులకు కూరగాయల కొనుగోలుదారులకు ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా సిరిసిల్ల మానేరు తీరంలో ఆధునిక వసతులతో నిర్మించిన రైతు బజార్‌పై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారుతోంది. జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావించినా.. లక్ష్యం మాత్రం నేరవేరడం లేదు. మున్సిపల్ అధికారులు కనీసం మార్కెట్ వైపు చూసిన దాఖలాలు లేవనే విమర్శలు ఉన్నాయి. మున్సిపల్ కౌన్సిల్ ఉన్న సమయంలో అడపాదడపా దృష్టి సారించినా ప్రత్యేక అధికారి పాలనలో మరింత నిర్లక్ష్యంగా మున్సిపల్ మారిందనే విమర్శలు ఉన్నాయి. కేవలం పారిశుధ్య కార్మికులు రెండు, మూడు రోజులకు ఒకసారి నామమాత్రంగా శుభ్రం చేస్తున్నారు. శానిటేషన్ తీరు కూడా అధ్వానంగానే మారింది. నిర్వహణపై నెలకొన్న నిర్లక్ష్యంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

గత ప్రభుత్వ హయాంలో పాత మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందులను తొలగించే విధంగా ఎంతో ఆర్భాటంగా రైతు బజార్‌ను నిర్మించి 2020 జూన్ 23న ప్రారంభించారు. తొలిరోజు మాత్రమే రైతుబజార్‌లోని వివిధ షెడ్లలో కనిపించిన రైతులు మళ్లీ వాటిని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. రైతు బజార్‌ను మొదట్లో మార్కెట్ కమిటీ ఆధీనంలో ఉండగా దానిని సిరిసిల్ల మున్సిపాలిటీకి బదలాయించారు. దీంతో మార్కెట్ పూర్తిగా వినియోగదారులకు, రైతులకు ఉపయోగకరంగా మారుతుందని భావించారు. గత కౌన్సిల్, మున్సిపల్ అధికారుల తీరును వెక్కిరిస్తూనే వారి పాలకవర్గం గడువు ముగిసిపోయింది. ఇప్పుడు రైతు బజార్ సిరిసిల్లకు అలంకారప్రాయంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. సిరిసిల్ల గాంధీచౌక్ వద్ద గ్రామ పంచాయతీ కాలం నుంచి కొనసాగుతున్న పాత మార్కెట్‌లోనే ఉదయం నుంచి రాత్రివరకు క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. రైతుబజార్‌లో మాత్రం ఉదయం వేళ 11గంటల వరకు కూరగాయల అమ్మకాలు జరుగుతున్నాయి. రైతు బజార్‌కు కొద్దిమంది రైతులే వస్తుండడంతో మళ్లీ పాత మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి .

మిగతా 8లో

జిల్లెల్ల పాఠశాలను సందర్శించిన కర్ణాటక బృందం



విద్యార్థులతో కర్ణాటక బృందం

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండం జిల్లెల్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని కర్ణాటక రాష్ట్రానికి చెందిన ముద్దనహళ్లి శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించడానికి వచ్చిన బృందం రాగిజావ తాగడం, క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్న తీరును చూసి సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన వసతులను కల్పించడానికి సాయం అందిస్తామని తెలిపారు. పాఠశాలను సందర్శించిన వారిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధి కళ్యాణ్, శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ రీజినల్ మేనేజర్ ధనుంజయ రావు, సిరిసిల్ల ఇన్‌చార్జి నరేష్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జోగినిపల్లి అనూరాధలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి..

- లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్‌రావు



అవగాహన కల్పిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్‌రావు

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లిఖార్జున్‌రావు అన్నారు. శుక్రవారం లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్లలో అపెరల్ పార్కులోని మహిళ ఉద్యోగులకు ఆర్థిక క్రమశిక్షణపై అవగాహ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌బీఎం మాట్లాడుతూ ప్రతి నెలా వచ్చే వేతనాలను సరైన విధంగా ఖర్చు చేసుకోవాలని వేతనం నుంచి డబ్బులు పొదుపు చేస్తూ ప్రభుత్వ బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. దీంతో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని అన్నారు. అనవసర ఖర్చులు పెట్టకూడదని బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించాలని సూచించారు. సోషల్ మీడియా ఇతర ఆర్థిక ప్రకటనలు నమ్మి పెట్టుబడులు పెట్టవద్దని తెలిపారు. ఫోన్ ద్వారా ఎవరూ బ్యాంక్ వివరాలు అడిగినా చెప్పవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ కౌన్సెలర్ వెంకటరమణ, గ్రీన్ నీడిల్ మేనేజర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్లపై చర్యలు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత అధ్యక్షతన పీసీపీఎన్‌డీటీ అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ తెలంగాణ, కలెక్టర్ ఆదేశాల ప్రకారం పీసీపీఎన్‌డీటీ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించామన్నారు. జిల్లాలోగల స్కానింగ్ సెంటర్లు నియమనిబంధనలు పాటించాలని, ఫామ్ ఎఫ్ ఆడిట్‌లను, స్కానింగ్ సెంటర్ల వివరాలను పరిశీలించాలన్నారు. రేడియాలజిస్టులతో స్కానింగ్ నిర్వహించాలని వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, పీవోఎంఎస్ఎస్ డాక్టర్ అంజలిఆల్ఫ్రెడ్, డీజీవో శోభారాణి, ఎన్జీవో చింతోజ్ భాస్కర్, లీగల్ అడ్వైజర్ శాంతి ప్రకాష్ శుక్లా, ఝాన్సీ లక్ష్మీ, హెచ్‌ఈ బాలయ్య పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టైలర్స్ దినోత్సవం

వేములవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ టైలర్స్ దినోత్సవం వేడుకలను శుక్రవారం వేములవాడ పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ టౌన్ లేడీస్ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కేక్ కట్ చేసి స్వీట్స్ తినిపించుకున్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రెడీమేడ్ దుస్తుల విక్రయం వల్ల చాలామందికి ఉపాధి లభించడం లేదన్నారు. టైలర్స్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు, పించను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వాసం భూమేష్, కోశాధికారి ఖాజా నహీముద్దీన్, ప్రధాన కార్యదర్శి కోడం సురేష్, ఉపాధ్యక్షురాలు గుడుసెల ఆశ, సంయుక్త కార్యదర్శి అన్నే సంగీత, సహాయ కార్యదర్శి నాగుల సురేష్, ప్రచార కార్యదర్శి శ్రీపతి సతీష్, కార్యవర్గ సభ్యులు గణేష్, మోహన్, భాగ్యశ్రీ, మధుమిత, లహరి, వేముల వజ్రమ్మ పాల్గొన్నారు.

● బోయినపల్లి : మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టైలరింగ్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులు స్వతహాగా కుట్టుకున్న దుస్తులను వేసుకొని వచ్చారు. హెచ్‌ఎం బొలగం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమ దుస్తులను కుట్టుకోవడం అభినందనీయమని, శిక్షణనిచ్చిన టైలరింగ్ ఉపాధ్యాయురాలు కేశవరాజు శమంతకమణిని అభినందించారు. అనంతరం సైన్స్‌డే వేడుకల సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబానికి సమయం కేటాయించాలి..

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు తమ పూర్తి సమయాన్ని కుటుంబానికే కేటాయించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగ విరమణ పొందిన హౌసింగ్ పీడీ బి చిన్నయ్య, కలెక్టరేట్ డీ సెక్షన్ సూపరింటెండెంట్ జావీద్‌అహ్మద్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాధాబాయి, రాజేశ్వర్, సీపీవో శ్రీనివాసచారి, డీఆర్‌డీవో శేషాద్రి, పశు సంవర్ధక శాఖ ఏడీ రవీందర్, కలెక్టరేట్ ఏవో రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పవర్‌లూం కార్మికులు, వార్పిన్, వైపనితో పాటు ఇతర అనుబంధ రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యార్‌ను జిల్లా పవర్‌లూం వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)నాయకులు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కోడం రమణ, ప్రధాన కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడారు. బతుకమ్మ చీరలకు సంబంధించి 2023 సంవత్సరానికి చెందిన 10 శాతం యారన్ సబ్సిడీని విడుదల చేయాలని, ప్రభుత్వం కార్మికుల ఉపాధికి టెస్కో ద్వారా ఉత్పత్తి చేయించనున్న(ఎస్‌హెచ్‌జీ) చీరల ఇతర ప్రభుత్వ వస్త్రాలకు పవర్‌ల్లూం కార్మికులకు రోజుకు రూ.1000 వేతనం వచ్చే విధంగా కూలీని నిర్ణయించాలని కోరమాన్నారు. వర్కర్ టూ ఓనర్ పథకానికి సంబంధించిన పనులను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి, వయోపరిమితిని పెంచాలని కోరమన్నారు. కార్యక్రమంలో నక్క దేవదాస్, బాస శ్రీధర్, కమ్మరికుంట కిషన్, జెజుగం సురేష్, సిరిమల్ల సత్యం, ఎక్కల్‌దేవి జగదీష్, గండు రమేష్, స్వర్గం శేఖర్ పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా వస్త్రోత్పత్తి చేయాలి

- చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజరామయ్యార్



సమావేశంలో మాట్లాడుతున్న చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజరామయ్యార్, చిత్రంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అందించిన ఆర్డర్ల లక్ష్యానికి అనుగుణంగా ఉత్పత్తి చేయాలని చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజరామయ్యార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఆసాములు, యజమానులు, కార్మికులతో ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లపై సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ శాఖలు, సమగ్రశిక్ష అభియాన్, మహిళ శక్తి చీరల ఆర్డర్ల ఉత్పత్తిపై సమీక్షించారు. సిరిసిల్ల పరిశ్రమకు ఇచ్చిన ఆర్డర్లలో మార్చి 15వ తేదిలోగా 50 శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. వస్త్ర పరిశ్రమలో ఎదుర్కుంటున్న ఇబ్బందులపై అడిగి తెలుసుకున్నారు. సెస్ విద్యుత్ బ్యాక్ బిల్లింగ్ సమస్య పరిష్కరించాలని, యంత్రాల కొనుగోలుపై సహాయం అందించాలని పారిశ్రామికులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని యజమానులు, ఆసాములు, కార్మికుల్లో అర్హులైన వారందరికి బ్యాంక్‌ల నుంచి రుణాలు అందజేసే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన బకాయిలను త్వరలో అందజేస్తామని ప్రకటించారు. విద్యుత్ బ్యాక్ బిల్లింగ్, అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తామని తెలిపారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు ఆరు నెలల పాటు ఉపాధి కల్పించాలని ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దీనికి అనుగుణంగా పరిశ్రమ బాధ్యులు ప్రణాళిక ప్రకారం ఉత్పత్తి చేయాలని మిగతా రోజుల్లో ప్రైవేటు మార్కెట్ నుంచి ఆర్డర్లు పొందేలా సిద్ధం కావాలని సూచించారు. మార్కెట్‌కు అనుగుణంగా సిద్ధం కావాలని కోరారు. ఇటీవలే పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల సమీక్షించారని గుర్తుచేశారు. వస్త్రపరిశ్రమ బాధ్యులకు ఇబ్బందులుంటే రాతపూర్వకంగా తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. వాటిని త్వరగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. వస్త్ర పరిశ్రమ బాధ్యులు ఆయా శాఖల ఆర్డర్లు తీసుకొని అందజేయాలని ఆదేశించారు. ఆర్డర్లు వచ్చే అవకాశం ఉంటుందని ఆలస్యం అయితే పరిశ్రమపై ప్రభావం పడుతుందని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన యారన్ బ్యాంక్ నుంచి ముడిసరుకు పంపిణీలో ఇబ్బందులను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టీజీఎస్‌కో జీఎం రఘునందన్, టీజీఎస్‌కో ఏడీ సందీప్‌జోషి గౌతమ్, జౌళి శాఖ ఏడీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు..

- ప్రశ్న పత్రాలను పోలీసు బందోబస్తుతో తరలించాలి..
- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, అధికారులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్‌ఆర్‌ఎస్‌పై కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లతో పాటు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షలపై ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంతి కుమారి సమీక్షిస్తూ మార్చి 5నుంచి పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తయిందని, ప్రశ్న పత్రాలు జిల్లాకు చేరుకున్నాయని, శనివారం నుంచి ప్రశ్నపత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లో నుంచి పోలీస్ స్టేషన్లకు చేరుతాయన్నారు. ప్రశ్నపత్రాలు తరలింపు పోలీసు బందోబస్తు మధ్య ఉంటుందన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశాలు జిల్లాలో జరిగాయని, అవసరమైన మేర ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేయాలని సూచించారు. పరీక్షలు నిర్వహించి సంబంధిత జవాబు పత్రాలు పోస్టల్ ద్వారా పంపే వరకు వరకు జిల్లాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్‌సెంటర్‌లను మూసివేయాలని, పరీక్షకేంద్రాల వద్ద అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసి విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని ఎటువంటి కాపీయింగ్ కు పరీక్ష కేంద్రాల్లో అవకాశం ఉండవద్దని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది, విద్యార్థులు ఎవరు సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకుని రావడానికి వీలు లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన తాగునీరు, విద్యుత్ సరఫరా ఉండాలని, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్షిస్తూ ఎల్‌ఆర్‌ఎస్- 2020 కింద 25 లక్షల దరఖాస్తులు వచ్చాయని, గత సెప్టెంబర్ 2024లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని దరఖాస్తుల క్రమబద్ధీకరణ మాత్రమే జరిగిందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందని అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. లక్షా 90వేల వరకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ఆమోదించే వాటికి మార్చి 31 వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుములో 25శాతం మినహాయింపు ఉంటుందని సమాచారం అందించామన్నారు. ఆగస్టు 26, 2020వరకు 10శాతం ప్లాట్లు విక్రయించిన లేఔట్‌లను క్రమబద్ధికరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, సబ్‌రిజిస్టర్ ద్వారా నిర్ణీత నమూనాలో నూతన దరఖాస్తులు సేకరించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి క్రమబద్ధీకరణ చేస్తామన్నారు.

జిల్లాలో 9310 మంది ఇంటర్ విద్యార్థులు

జిల్లాలో ఇంటర్ పరీక్షలకు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశామని జిల్లాలో మొదటి, రెండవ సంవత్సరానికి సంబంధించి 9310మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌కు వివరించారు. మార్చి 5 నుంచి 25వరకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, వాటికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరంలో 5065 మంది, రెండో సంవత్సరంలో 4245మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. వీరికోసం 16పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని అన్నారు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కింద 42,942 దరఖాస్తులు స్వీకరించామని, 27,170 దరఖాస్తులు ప్రాసెస్ చేశామని, 15,772 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి శ్రీనివాస్, ఆర్డీవోలు రాజేశ్వర్ రాధాబాయి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కదారి రాములు

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం..

- భవన నిర్మాణ కార్మిక సంఘు జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు

8

ఘనంగా సైన్స్ దినోత్సవం

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రయోగాలు

- సైన్స్ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

8



ఎల్లారెడ్డిపేటలో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవో కృష్ణహరి

విశ్రాంత ప్రొఫెసర్ సైండ్ల అంజయ్య మృతి


సైండ్ల అంజయ్య(ఫైల్)

గన్నేరువరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా సుదీర్ఘ కాలం పనిచేసి పదవీవిరమణ పొందిన ప్రొఫెసర్, డాక్టర్ సైండ్ల అంజయ్య(75) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. సైండ్ల అంజయ్య స్వస్థలం గన్నేరువరం మండలకేంద్రం. ఆయన గన్నేరువరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత ఎలగందల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏడవతరగతి చదువుకుని పైతరగతులు అక్కడ లేకపోవడంతో హైదరాబాద్ పట్టణానికి చేరుకున్నాడు. అక్కడ ఆయన ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఒక హోటల్‌లో క్లీనర్‌గా పనిచేస్తూ అక్కడి ప్రభుత్వ పాఠశాలలో పదవతరగతి పూర్తిచేశాడు. ఆ తరువాత ఉన్నత చదువులు చదివి సెక్రెటేరియట్‌లో టైపిస్ట్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. కొద్దిరోజుల తరువాత ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో స్థిరపడి సుదీర్ఘకాలం పనిచేసి కొన్నేళ్ల కిందటే పదవీ విరమణ పొందారు. డాక్టర్ సైండ్ల అంజయ్య పలుడిగ్రీలు, డిప్లొమాలు, డాక్టరేట్, లా చదివి ఎన్నో విజయాలను సాధించి గన్నేరువరం గ్రామానికి ఆదర్శంగా నిలిచారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని విజయాలను సాధించాలని స్థానికులు పేర్కొంటూ ఆయనకు నివాళులు అర్పించారు.

కుంభమేళాకు వెళ్లిన మంథని వాసులకు రోడ్డు ప్రమాదం

● పలువురికి గాయాలు

మంథని, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళకు వెళ్లిన మంథని వాసులులో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈమేరకు బాధిత కుటుంబసభ్యులకు శుక్రవారం రాత్రి సమాచారం అందింది. స్థానిక హనుమాన్‌నగర్‌కు చెందిన మిర్యాల సాగర్ తన కుటుంబసభ్యులు, మరికొందరు యువకులతో కలిసి నాలుగురోజులక్రితం సొంతకారులో కుంభమేళాకువెళ్లారు. కుంభమేళాలో పుణ్యస్నానాల అనంతరం తిరుగు ప్రయాణంలో ప్రయాగ్‌రాజ్‌కు సమీపంలో తెల్లవారుజామున 4గంటలప్రాంతంలో కారు వేగంగా అదుపుతప్పి రోడ్డు పక్కఉన్న చెట్టును ఢీకొనగా కారులోని సాగర్‌కుతోపాటు మరికొందరికి గాయాలైనట్లు సమాచారం. వీరిరందని సమీపంలోని నెహ్రూఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అయితే ప్రమాదానికి గురైన వారి సెల్‌ఫోన్లు పనిచేయకపోవడం, స్థానికపోలీసుకు ఎలాంటిసమాచారం లేక పోవడంతో ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియడం లేదు.

సదరం సేవలు మరింత సులభతరం



● 21 రకాల కేటగిరీలను చేర్చిన కేంద్ర ప్రభుత్వం
● నేటి నుంచి రాష్ట్రంలో అందుబాటులోకి యూడీఐడీ పోర్టల్
● ఇక నుంచి స్మార్ట్ కార్డులు జారీ

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సదరం సేవలు మరింత సులభతరం కానున్నాయి. స్వయంగా దివ్యాంగులే దరఖాస్తు చేసుకునేలా కేంద్రం కొత్తగా యూనిక్ డిసేబిలిటీ ఐడెంటిటీ కార్డు (యూడీఐడీ) పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో శనివారం నుంచి యూడీఐడీ పోర్టల్ అందుబాటులోకి రానుంది. ఈ పోర్టల్‌లో సదరం సర్టిఫికెట్ లేని వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర వివరాలతో పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఆధార్‌కార్డు లేదా మరేదైనా గుర్తింపుకార్డును అప్‌లోడ్ చేయాల్సి వస్తుంది. అనంతరం సదరం శిబిరం జరిగే స్థలాన్ని ఎంపిక చేసుకొని దరఖాస్తు సబ్మిట్ చేస్తే సరిపోతుంది. ఆ దరఖాస్తును అధికారులు పరిశీలించి క్యాంపునకు ఎప్పుడు హాజరు కావాలనే వివరాలను దరఖాస్తుదారుడి ఫోన్‌కు పంపుతారు. శిబిరం లో వైద్యులు రిపోర్టులు పరిశీలించి అంగవైకల్యాన్ని నిర్ధారిస్తారు. అనంతరం దరఖాస్తు ఏ స్థాయిలో ఉందో తెలుసుకునే అవకాశం పోర్టల్‌లో ఉంటుంది. అయితే ప్రభుత్వం ఈ పోర్టల్‌పై ట్రయల్ నిర్వహిస్తున్నది.

స్మార్ట్ కార్డులు

సదరం సర్టిఫికెట్లు ఇప్పటి వరకు ఏ4 పేపర్ మీద ఇస్తున్నారు. ఇకపై స్మార్ట్ కార్డుపై ఐడీ నంబర్‌తో పాటు లబ్ధిదారుడి ఫొటో, పేరు, వైకల్యం రకం, వైకల్యం శాతం వివరాలు ఉంటాయి. స్మార్ట్ కార్డును పోస్ట్ ద్వారా ఇంటికి పంపిస్తారు. ఇప్పటికే సదరం సర్టిఫికెట్లు ఉన్న వారికి కూడా స్మార్ట్ కార్డులు జారీ చేయనున్నారు. ఇప్పటివరకు మీ సేవ కేంద్రాలలో సదరం స్లాట్ నమోదుకు కేవలం ఐదు రకాల కేటగిరీల వారికే అవకాశం ఉండేది. ఇప్పుడు కేంద్రం కొత్తగా రూపొందించిన యూడీఐడీ పోర్టల్‌లో మొత్తం 21 రకాల కేటగిరీలను చేర్చింది.

ఇందులో ప్రధానంగా తలసేమియా, ఆటిజం, యాసిడ్, న్యూరో బాధితులు కూడా సదరం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులకు వైకల్య శాతం తెలియజేసేందుకు జారీ చేస్తున్న సదరం ధ్రువపత్రాల స్థానంలో కొత్తగా యూనిక్ డిసేబిలిటీ ఐడెంటిటీ కార్డు జారీ చేయనున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలలో ఇవి అందుబాటులో ఉండగా మన రాష్ట్రంలో శనివారం నుంచి అందు బాటులోకి రానున్నాయి. ఇక నుంచి సదరం శిబిరానికి వచ్చే దివ్యాంగులందరికీ అందజేయనున్నారు. వైకల్య శాతం ఆధారంగా నిర్ధారిత రంగులో జారీ చేస్తారు. ఒక్కసారి వస్తే మళ్లీ పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉండదు. కాగా ఇప్పటి వరకు ఇచ్చిన సదరం ధ్రువపత్రాలు మన రాష్ట్రంలోనే పని చేస్తున్నాయి. కానీ ఇప్పుడు ఇచ్చే కార్డులు ఇతర రాష్ట్రాలలో కూడా పనిచేస్తాయి. రైళ్లు, బస్సుల్లో రాయితీతో పాటు దివ్యాంగులకు సంబంధించిన అన్ని రాయితీలను పొందవచ్చు.

డిజిటల్ సంతకాలు

దివ్యాంగులు ఎప్పటిలాగే సదరం శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది. ఇందు కోసం స్మార్ట్ ఫోన్ నుంచి యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అవగాహన లేని వారు మీ-సేవ కేంద్రాల నుంచి చేసుకోవచ్చు. పరీక్షల అనంతరం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తారు. దివ్యాంగుల పూర్తి వివరాలు, వైకల్యం శాతం వైద్యుల లాగిన్‌కు చేరుతుంది.

ఒకసారి వివరాలు అన్ని సరిగా ఉన్నాయో లేదో అని సరి చూసుకుని అప్‌లోడ్ చేయగానే కార్డు మంజూరు అవుతుంది. కార్డుపై డిజిటల్ సంతకం ఉంటుంది. ఇవి పోస్టు ద్వారా దరఖాస్తు దారుడికి పంపిస్తారు. ఒకసారి వైకల్యం శాతం నమోదు అయితే దానిని పెంచడం లేదా తగ్గించడం ఉండదు. దాని ప్రకారమే ప్రభుత్వం పింఛను మంజూరు చేస్తుంది.

దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి
పీడీ రఘువరణ్



దివ్యాంగులు యూడీఐడీ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి. సదరం ధ్రువపత్రాల స్థానంలో కొత్తగా యూనిక్ డిసేబిలిటీ ఐడెం టిటీ కార్డు జారీ చేయనున్నాం. వైకల్య శాతం ఆధారంగా నిర్ధారిత రంగులో స్మార్ట్ కార్డులు జారీ చేస్తాం.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


ప్రవీణ్ (ఫైల్)

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, మైక్రోఫైనాన్స్‌లో అప్పుల వేధింపులతో శుక్రవారం సాయంత్రం తంగళ్లపల్లి మండలం కేసీఆర్(డబుల్ బెడ్ రూం)నగర్‌లో గరికె ప్రవీణ్(30) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రవీణ్ గతంలో పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగించాడు. పెయింటర్‌గా సరైన పని దొరకకపోవడంతో సిరిసిల్లలోని కిరాణా దుకాణంలో పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఇదేక్రమంలో మైక్రో ఫైనాన్స్‌లో తీసుకున్న రుణానికి సంబంధించిన వాయిదాలు చెల్లించాలంటూ నిర్వాహకులు ఇబ్బందులు పెట్టినట్లు తెలిసింది. ఆర్థిక ఇబ్బందులు, వేధింపులతో మానసికంగా కుంగిపోయిన ప్రవీణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య గాయత్రి, కుమారుడు గౌతమ్, కూతురు నిఖిత ఉన్నారు.

ఒంటరి జీవితంపై విరక్తి చెంది ఒకరు..


రాజ్‌కుమార్ (ఫైల్)

మల్లాపూర్, ఫిబ్రవరి, 28 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్‌కు చెందిన ముచ్చుకుర్తి రాజ్‌కుమార్(32) అనే యువకుడు ఒంటరి జీవితంపై విరక్తి చెంది తాగుడుకు బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్ర వారం ఎస్‌ఐ రాజు తెలిపారు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజ్‌కుమార్‌కు నాలుగేళ్ల క్రితం వివాహం కాగా విడాకులై ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో తాగుడుకు బానిస య్యాడు. స్థానిక జాతరకు వెళ్తానని చెప్పి వెళ్లిన రాజ్‌కుమార్ ఎంతకూ తిరిగి రాలేదు. అతడి కోసం తండ్రి, బంధువులు ఆరా తీయగా మల్లాపూర్ శివారులో గల ఎల్లమ్మ చెరువు వద్ద చింతచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రసవం కోసం వెళ్లిన గర్భిణి మృతి

● పల్లిమక్తలో విషాదం


సోని(ఫైల్)


కోనరావుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తొలి ప్రసవం కోసం వెళ్లిన ఓ గర్భిణి చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కోన రావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన వంకాయల పద్మ-నాగయ్యల కూతురు సోని(22)ని 10నెలల క్రితం మండలంలోని పల్లిమక్తకు చెందిన సిద్రవేణి బాబుకు ఇచ్చి వివాహం చేశారు. సోని తొమ్మిది నెలల గర్భవతి కావడంతో పురిటినొప్పులు రాగా బుధవారం వేములవాడ ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. వైద్యులు అందుబాటులో లేరని తెలియడంతో అదే రోజు కొండపూర్‌కు వచ్చారు. గురువారం పల్లిమక్త ఆశావర్కర్ కనక లక్ష్మిని తీసుకొని ప్రసవం కోసం వేములవాడ ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షిస్తున్న సమయంలో ఫిట్స్ రావడంతో కరీంనగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి తల్లీబిడ్డ ఆరోగ్యం విషమంగా ఉందని హైదరాబాదులోని గాంధీఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కడుపులోనే శిశువు మృతిచెందిందని, తల్లిని రక్షించే ప్రయత్నం చేస్తామని చెప్పి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ తర్వాత తల్లి కూడా మృతిచెందడంతో పల్లిమక్త గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తొలి కాన్పులో తల్లీబిడ్డ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పూర్తి వివరాలు పోస్టుమార్టం తర్వాత తెలుస్తాయని వైద్యులు చెబుతున్నారు.

ఈతకు వెళ్లి ఆర్టీసీ డ్రైవర్ మృతి


తిరుపతిరావు(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో ఈతకువెళ్లిన కటారి తిరుపతిరావు(59) అనే ఆర్టీసీడ్రైవర్ ప్రమాదవశాత్తు కాళ్లకు చేపల వల చిక్కుకొని శుక్రవారం నీటమునిగి మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ అల్కాపురి కాలనీలో నివాసం ఉంటున్న తిరుపతి రావు కోరుట్ల ఆర్టీసీడిపోలో డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి విధులకు వెళ్లడం లేదు. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన తిరుపతిరావు 7:30గంటల ప్రాంతంలో మానేరు జలాశయంలోకి ఈత కోసం దిగాడు. 500మీటర్ల దూరం వరకు ఈదుకుంటూ వెళ్లాడు. తిరిగి ఒడ్డుకువస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు చేపల వల కాళ్లకు చుట్టుకుంది. ఒడ్డుకు చేరుకునేందుకు ప్రయత్నించినా సాధ్యంకాక అక్కడే నీట మునిగిపోయాడు. గమనించిన కొందరు వెంటనే జాలర్లకు, సేఫ్టీవింగ్‌లో పనిచేసిన ఆనంద్‌కు సమాచారం అందించారు. ఆనంద్‌టీం బోట్ల సహాయంతో సంఘటన స్థలంలో వెదికినా ప్రయోజనం లేకుండా పోయింది. మధ్యాహ్నం సమయంలో తిరుపతిరావు మృతదేహం లభ్యమైంది. మృతుడి కొడుకు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని మాతాశిశు కేంద్రం వద్ద గుర్తుతెలియని వృద్ధుడు(65) మృతి చెందినట్లు కరీంనగర్ ప్రభుత్వాస్పత్రి అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుళ్లు కె.రవీందర్, ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి 1:30గంటల సమయంలో వృద్ధుడు మృతి చెంది పడి ఉండడాన్ని గమనించి మార్చురీ గదిలో భద్రపరిచామని పేర్కొన్నారు. మృతుడు కొద్దిరోజులుగా ప్రభుత్వాస్పత్రి, మాతాశిశుకేంద్రం వద్ద ఫుట్‌పాత్‌పై పడుకునేవాడని తెలిపారు. మృతుడిని గుర్తించినవారు కరీంనగర్ టూటౌన్ సీఐ 8712670762, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ 9491481433కి సమాచారం అందించాలని పేర్కొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి 6 నెలల జైలు శిక్ష

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వ్యక్తి రాగుల బాల్‌రెడ్డికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ఒకటవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సృజన తీర్పు వెల్లడించారని కోర్టు కానిస్టేబుల్ శంకర్ శుక్రవారం పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని నంది కిషన్, రాగుల బాల్‌రెడ్డి స్నేహితులు. కొన్నినెలల క్రితం బాల్‌రెడ్డి తన అవసర నిమిత్తం నంది కిషన్‌వద్ద రూ.5లక్షలు తీసుకున్నాడు. డబ్బులు చెల్లించాలని నంది కిషన్ కోరడంతో రెండు చెక్కులను అందజేశాడు. బ్యాంకులో జమ చేయగా బాల్‌రెడ్డి అకౌంటులో డబ్బులు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యాయి. దాంతో కిషన్ కోర్టు ద్వారా నోటీసులను పంపించాడు. బాల్‌రెడ్డి నుంచి స్పందన లేకపోవడంతో కిషన్ కోర్టును ఆశ్రయించాడు. పూర్వాపరాలు పరిశీలించిన మేజిస్ట్రేట్ సృజన నిందితుడు బాల్‌రెడ్డికి ఆరునెలలు జైలుశిక్ష విధించడంతోపాటు రూ.5లక్షలు బాధితుడికి చెల్లించాలని తీర్పునిచ్చారు.

ఆటో డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

గంభీరావుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : అతివేగంగా ఆటో నడిపి చిన్నారి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.4100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల అదనపు ప్రథమశ్రేణి మేజిస్ట్రేట్ కావేటి స్పందన శుక్రవారం తీర్పు చెప్పారని స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. 2016 జూన్29న గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన చిన్నారి గుగులోతు సంజన(7) తన ఇంటి ఎదుట నిలబడి ఉండగా గంభీరావుపేటకు చెందిన ఆటో డ్రైవర్ లింగంపల్లి శ్రీనివాస్ అతివేగంగా వచ్చి సంజనను ఢీకొట్టడంతో మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి లింగంపల్లి శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించారు. కోర్టులో పీపీ సతీష్‌గౌడ్ వాదించగా, కోర్టు కానిస్టేబుల్ జనార్దన్ సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధించారు.

ఆటో, కారు ఢీ

● పలువురికి గాయాలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రగుడు చౌరస్తాలో శుక్రవారం ఆటోకు కారు ఢీకొని పలువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల నుంచి వేములవాడకు వెళుతున్న ఆటోకు వేములవాడ నుంచి సిరిసిల్ల వైపు అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సిరిసిల్లకు చెందిన కవిత(35), గీత(30), రిషి(3), దుబ్బాకకు చెందిన నర్సయ్యకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను చికిత్సకోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

● ఎన్నికల సిబ్బంది 19మందికి గాయాలు
● కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

కరీంనగర్‌క్రైం/కొడిమ్యాల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలట్ బాక్స్‌లను కరీంనగర్‌కు తరలించి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 మంది ఎన్నికల సిబ్బంది గాయపడ్డట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్ జిల్లాకుచెందిన రెండు ఆర్టీసీ బస్సుల్లో అక్కడి బ్యాలట్‌బాక్స్‌లను ఎన్నికల సిబ్బంది గురువారం రాత్రి కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో స్ట్రాంగ్ రూంకు చేర్చారు. అనంతరం తిరిగి నిర్మల్‌కు వెళుతున్న క్రమంలో వేకువజామున 3గంటల ప్రాంతంలో జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తురుకకాశీనగర్ ప్రాంతంలోని రైల్వేగేట్ వద్ద ఒకదాని వెనుక మరొక బస్సు ఢీకొన్నాయి. దీంతో వెనుక బస్సులో ఉన్న 19మందికి గాయాలయ్యాయి, బస్సు డ్రైవర్ ఎండీ నయీమొద్దీన్ కాలు విరిగింది. రెవెన్యూ ఉద్యోగి పురుషోత్తంకు కడుపు, ఛాతీ భాగంలో దెబ్బలు తగలటంతో వీరిద్దరినీ ప్రభుత్వఆసుపత్రిలోని ఐసీయూలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మిగతా 17 మంది ఉద్యోగులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి వైద్యం అందిస్తున్నారు. గాయపడిన ఉద్యోగులను నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆసుపత్రిలో పరామర్శించి, మెరుగైన వైద్య సహాయం అందించాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు.



కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ ఎండీ నయీమొద్దీన్, ఎన్నికల సిబ్బంది

కత్తులతో యువకుల వీరంగం

● ఇద్దరికి గాయాలు... ద్విచక్ర వాహనం ధ్వంసం

కోరుట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం యువకులు కత్తులతో వీరంగం సృష్టించారు. దుకాణంలోకి కస్టమర్లు రాకుండా రోడ్డుకు అడ్డంగా పానిపూరి బండి పెడుతున్నావని బండి యజమానిని ప్రశ్నించగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి కత్తులతో దాడికి దారితీసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్త బస్టాండ్ ప్రాంతంలోని హనుమాన్ వ్యాయామశాలలోని దుకాణ సముదాయంలో ముత్యాల సుమత్, అతడి సోదరుడు రేవంత్‌లు సెలూన్ దుకాణం నడుపుతున్నారు. దుకాణ సముదాయం వెళ్లే దారి వద్ద ప్లాట్ ఫారంపై రాజస్థాన్‌కు చెందిన ప్రేమ్ అనే వ్యక్తి పానిపూరి బండి నడుపుకుంటున్నాడు. సుమత్, అతడి సోదరుడు తమ దుకాణంలోని కస్టమర్లు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని బండిని అక్కడి నుంచి తీయాలని తరచుగా గొడవ పడేవారు. ఇదే క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ప్రేమ్‌ను సుమత్ అతడి సోదరుడు రేవంత్‌లు దారి విషయంలో గొడవ పడ్డారు. దీంతో పక్కనే ఉన్న కొబ్బరి బోండా బండి వద్దకు వెళ్లిన సెలూన్ యజమానులు మొదట అక్కడ కత్తితో ప్రేమ్‌పై దాడి చేయడానికి ప్రయత్నించగా తేరుకున్న ప్రేమ్ తన బండిలో పెట్టుకున్న కత్తిని తీసి ఇద్దరిపై దాడి చేసినట్లు తెలిపారు. దీంతో సుమత్, రేవంత్‌లు స్వల్ప గాయాల పాలయ్యారు. అదే దుకాణ సముదాయంలో ఉన్న ఓ ద్విచక్ర వాహనం దాడిలో ధ్వంసమైంది. పోలీసులు అక్కడికి చేరుకోగా ప్రేమ్ కత్తితో తన స్నేహితుల ద్విచక్రం వాహనంపై పరారయ్యాడు. గాయపడిన సుమత్, రేవంత్‌లను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. సుమత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు.

విధుల్లోకి తీసుకోవాలని ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తనను విధుల్లోకి తీసుకోవాలని కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద శుక్రవారం ఆర్టీసీ డిపో-1 డ్రైవర్ జి.సురేష్(45) ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడే ఉన్న ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. 2023 సెప్టెంబరు 24న ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్‌గా పని చేస్తున్న సురేష్‌కు ఆర్టీసీ అధికారులు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా మోతాదుకు మించి మద్యం తాగినట్లు వెల్లడైంది. అధికారులు విధుల నుంచి టర్మినేట్ చేశారు. తనకు చిన్న పిల్లలున్నారని, తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సురేష్ ఆత్మహత్యకు యత్నించాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఆర్టీసీ డ్రైవర్‌పై ఒకటో టౌన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్శేడ్ 'మీసేవా' కేంద్రంలో విజిలెన్స్ పోలీసుల తనిఖీలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామ పరిధిలోని మీ సేవా కేంద్రంలో శుక్రవారం విజిలెన్స్ పోలీసులు తనిఖీలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి. రాష్ట్ర వ్యాప్తంగా మీ సేవా కేంద్రాల్లో జిల్లాకు ఒకటి వంతున తనిఖీ చేసినట్లుగా తెలుస్తోంది. ధరణిలో అవకతవకలు, మీ సేవాకేంద్రాల ద్వారా పహాణీ నకల్, పాస్‌బుక్ 1బీ, రెవెన్యూ కార్యాలయం నుంచి జారీ అయిన ఇతర ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసు కున్నారు. కొంతకాలంగా మీ సేవా కేంద్రం నుంచి జారీచేసిన సర్టిఫికెట్లు, ఇతర ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలించి నట్లు తెలిసింది. మీసేవా కేంద్రానికి వచ్చిన దర ఖాస్తులు, ఫీజు చెల్లింపులు తదితర విషయాలకు సబంధించి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. తనిఖీలపై విజిలెన్స్ పోలీసు అధికారులను సంప్రదించగా సమాచారం ఇచ్చేందుకు నిరాకరించారు.

మాజీ సర్పంచ్‌పై దాడి

రాయికల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని రామారావుపల్లె మాజీ సర్పంచ్ బీర మల్లయ్యపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. మల్లయ్య ద్విచక్ర వాహనంపై రాయికల్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఇటిక్యాల గ్రామ శివారులో దాడి చేశారు. ఈ దాడిలో మల్లయ్య చేతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ గుడి ప్రహరీ కూల్చివేత

● గౌడ కులస్తుల అందోళన


కూల్చిన ప్రహరీని పరిశీలిస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రహరీని కూల్చివేసిన వారిపై కఠినచర్యలు తీసుకుకోవాలని గౌడకులస్తులు శుక్రవారం ఆదోళన నిర్వహించారు. మహిళలు తమ కుటుంబ సభ్యులతో వచ్చి రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద నిరసన తెలిపినిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. గౌడకులస్తులు తమ కుటుంబ సభ్యులతో కలసి రాజీవ్‌రహదారిపై ధర్నా చేయడానికి ప్రయత్నం చేయడంతో ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ జోక్యం చేసుకుని గోడ కూల్చివేసిన వారిని పట్టుకుంటామని తగినచర్యలు తీసుకుంటామని హామీఇవ్వడంతో ధర్నా విరమించారు. దేవాలయంవద్ద జరిగిన సంఘటనను ఎస్‌ఐ శ్రావణ్ తదితరులు పరిశీలించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల సూచనలమేరకు కేసు నమోదు చేస్తామని, ప్రహరీకూల్చిన వారిని పట్టుకునిచర్యలు తీసుకుంటామన్నారు.

ప్రహరీనిఆరెల్లి చంద్రయ్య అనేవ్యక్తి ఎక్స్‌కావేటర్‌తో పూర్తిగా ధ్వంసం చేశాడని అతడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో పట్టణ గౌడ సంఘంనేతలు గడ్డంఅంజయ్య, సత్తయ్య అంతటి లచ్చయ్య, మంద మల్లయ్య, పొన్నం తిరుపతి, కొయ్యడ వెంకటేశ్, శ్రీనివాస్, జాగిరి మొగిలి, ప్రభాకర్ గౌడ్, సుల్తానాబాద్ మాజీ సర్పంచ్ అంతటి పుష్పలత, మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ ముత్యం సునీత ఉన్నారు.

ఎస్సారార్ అధ్యాపకుడికి జాతీయస్థాయి ఉత్తమ పరిశోధకుడు అవార్డు


శ్రీనివాసును అభినందిస్తున్న లెక్చరర్లు

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిసైన్స్ దినోత్సవం సందర్భంగా ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్‌సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ తిరుక్కోవల శ్రీనివాస్ ఐటుఓఆర్ సంస్థ జాతీయ పరిశోధక ఎక్స్‌లెంట్ అవార్డు 2025ను శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్నతవిద్య సంయుక్త సంచాలకుడు డాక్టర్‌రాజేంద్రసింగ్, డాక్టర్‌యాదగిరి అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట రామకృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్ పీనితిన్, డాక్టర్ తాళ్లపల్లి రాజయ్య అభినందించారు. తెలంగాణ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, వృక్షశాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ రౌతు రాధాకృష్ణ అభినందనలు తెలిపారు.

మహాశివరాత్రి ఆదాయం రూ.1.31 కోట్లు

● ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన మహాశివరాత్రి జాతరకు ఆయా ఆర్జిత సేవల ద్వారా కోటి 31,89,177 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో వినోద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం దాదాపు 11లక్షల ఆదాయం అదనంగా వచ్చినట్లు పేర్కొన్నారు. అధికంగా ప్రసాదాల విక్రయాలతో రూ.57,12,660 సమకూరగా, కోడె ముక్కుల ద్వారా రూ.45,83,500, ఆర్జిత సేవల ద్వారా రూ.55,706, కేశఖండనాల ద్వారా రూ.3,89400, వంద రూపాయల శీఘ్రదర్శనం ద్వారా రూ.6,97,700, అతిశీఘ్రదర్శనం ద్వారా రూ.13,04,100, బద్దిపోచమ్మ ఆలయం నుంచి రూ.1,91,390, భీమేశ్వర ఆలయం ద్వారా రూ.78,785, నగరేశ్వర ఆలయం ద్వారా రూ.7,830, వసతిగదుల ద్వారా రూ.1,05,280, ఇతర సేవల ద్వారా రూ.62,696 సమకూరినట్లు ఈవో వివరించారు. గతసంవత్సరం రూ.1,20,98704 సమకూరగా, ఈ సంవత్సరం రూ.1,31,89,117 ఆదాయం వచ్చింది. గతంకంటే ఈ సంవత్సరం రూ.10,90,473 అదనపు ఆదాయం వచ్చింది.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాధారణ భక్తుల రద్దీ నెలకొన్నది. వివిధప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని ఆయా క్యూ లైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకొని పార్వతీరాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం పద్మశాలీ మహాసభలు





మాట్లాడుతున్న కందగట్ల కుమారస్వామి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పద్మశాలి సమస్యలు, హక్కుల సాధనకోసం మహాసభలు ఏర్పాటు చేసినట్లు అఖిల భారత పద్మశాలీసంఘం జాతీయఅధ్యక్షుడు కందగట్ల కుమార స్వామి, రాష్ట్ర అధ్యక్షుడు కామార్తపు మురళి తెలిపారు. శుక్రవారం నగరంలోని పద్మశాలి ట్రస్టుభవన్‌లో జిల్లాస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంగా, సామాజికంగా పద్మశాలీలు చైతన్యవంతం అయ్యేందుకు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బలోపేతానికి మహాసభలు దోహదపడతాయన్నారు. బీసీకులగణన ద్వారా పద్మశాలీల్లో చైతన్యం వచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా 13లక్షల మంది పద్మశాలీలు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. మహాసభల అనంతరం పద్మశాలీ భరోసా కార్యక్రమాన్ని తెలంగాణప్రాంత పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పది లక్షల మందితో గ్రూపు ఏర్పాటు చేసి పదిరూపాయల చొప్పున జమచేసి బ్యాంకుఖాతా తీయనున్నామన్నారు. నిరుపేద పద్మశాలీలకు చేయూతనిందించేందుకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 17వ అఖిల భారతపద్మశాలీ మహాసభతోపాటు 8వతెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం మహాసభలను హైదరాబాద్‌లోని పద్మశాలీ భవన్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. మార్చి9న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లక్షమందితో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిలభారత పద్మశాలీసంఘం ప్రధానకార్యదర్శి గడ్డం శ్రీరాములు, రాష్ట్ర పద్మశాలీ సంఘం ప్రధానకార్యదర్శి రామచంద్రరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్, అధ్యక్షుడు మెతుకు సత్యం, ప్రధానకార్యదర్శి వల్లాల కృష్ణహరి, కోశాధికారి అల్లె భద్రయ్య, రాష్ట్రమీడియా ప్రధానకార్యదర్శి మార్త ప్రకాశ్, ట్రస్టు అధ్యక్షుడు స్వర్గం మల్లేశం, పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, యువజన సంగం అధ్యక్షుడు శ్రీకాంత్, మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, చొప్పరిజయశ్రీ, మంచికట్ల కోటేశ్వర్, గడ్డం వెంకటేశ్వర్లు, చేరాల మల్లికార్జున్ దేవ్, వోడ్నాల రవీందర్, స్వర్గం నర్సయ్య, వేముల చంద్రశేఖర్, దీకొండ లక్ష్మీనారాయణ, మెతుకు కృష్ణచైతన్య, వంగర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపుపై ఆశలు

● ఎవరి ధీమాలో వారే ● ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ముందెన్నడూ లేని విధంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను తలపించేలా జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ మధ్య నువ్వా..నేనా అన్నట్లు సాగిన పోరులో విజయం ఎవరిని వరించనున్నదోనని ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటుండగా తామే గెలుస్తామని ఎవరికివారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. హోరాహోరీగా సాగిన ముక్కోణపు పోటీలో మొదటి, రెండు స్థానాల్లో నిలిచేదెవరూ.. మూడో స్థానంలో ఉండేదెవరూ.. అన్నదానిపైనే అన్ని రాజకీయ పార్టీలు కూడికలు.. తీసివేతలతో తలపడుతున్నాయి. తొలి ప్రాధాన్యత ఓటుతో ఎవరు గెలిచే అవకాశం లేదన్నది స్పష్టంగా తేలిపోయింది. తొలి ప్రాధాన్యత ఓటుతో అభ్యర్థి విజయం సాధించాలంటే పోలైన ఓట్లలో చెల్లిన ఓట్లలో 50 శాతాని కంటే ఒక ఓటు అధికంగా రావలసి ఉంటుంది. ఏకపక్షంగా పోలింగ్ జరుగకపోవడం, ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కరికి ఓట్లు ఎక్కువగా పోల్ కావడంతో తొలి ప్రాధాన్యత ఓటుతో ఎవరు గెలిచే అవకాశం లేదని భావిస్తున్నారు. దీనితో రెండవ ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎక్కువగా పోలయ్యాయి.. ఎవరు.. ఎవరి తలరాతలు మార్చనున్నారు అన్నది అంతుపట్టకుండా మారింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో 56 మంది పోటీలో ఉన్నా ఎలిమినేషన్ పద్ధతిలో ఓట్ల లెక్కింపు చేపట్టే క్రమంలో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి మొదలు పెట్టి ఎలిమినేట్ చేస్తూ అతడి బ్యాలెట్‌లో రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి వస్తే వారికి వాటిని కలుపుతూ వెళ్తారు. చివరికి మూడో స్థానంలో నిలిచే అభ్యర్థి బ్యాలెట్‌లో వచ్చిన రెండవ ప్రాధాన్యత ఓట్లు ఎవరికి అనుకూలంగా వస్తాయో వారు గెలు పొందే అవకాశాలు ఉంటాయి. ఆ ఓట్లు రెండో స్థానంలో ఉన్నవారికి ఎక్కువగా వచ్చే పక్షంలో మొదటి అభ్యర్థి ఓడిపోవడానికి కూడా అవకాశాలుంటాయి. దీనితో మొదటి స్థానంలో నిలిచిన మిగతా అభ్యర్థుల కంటే కొంత ఎక్కువ సంఖ్యలో మెజార్టీ ఉంటేనే విజయం సాధించ గలమని భావిస్తున్న అభ్యర్థులు లెక్కలు వేసుకుంటూ కాలం గడుపుతున్నారు.

కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి తప్పకుండా మొదటి స్థానంలో ఉంటారని, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ రెండవ స్థానంలో, బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డి మూడవ స్థానంలో ఉంటారని గెలుపు తమదేనని కాంగ్రెస్‌నేతలు ధీమాగా చెబుతున్నారు. అయితే బీజేపీ నేతలు మాత్రం అన్ని ప్రాంతాల్లోనూ తమకు ఓటింగ్ జరిగినందున గెలుపు తమదేనని, రెండవ స్థానంలో నిలిచినా మూడవ అభ్యర్థి సెకండ్ ప్రాధాన్యత ఓటుతో తామే గెలుస్తామని చెబుతున్నారు. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ బీసీ సెంటిమెంట్ బలంగా రావడంతో గెలుపు అవకాశాలు తనకే ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. మొదటి రెండు స్థానాల్లోనే ప్రసన్న హరికృష్ణ ఉంటారని, రెండవ ప్రాధాన్యతా ఓట్లు తనకు ఏక పక్షంగా అన్ని జిల్లాల్లో పోల్ కావడంతో విజయం సాధించేది అతనేనని బీసీ నాయకులు బలంగా చెబుతున్నారు.

బీజేపీ రాష్ట్ర నాయకత్వం పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి అంజిరెడ్డికి ప్రచారక్రమంలో క్యాడర్‌తో సమన్వయ లోపం ఏర్పడిందని, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌తోపాటు స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు కష్టపడి పనిచేసినా పోలింగ్ బూత్‌ల పరిధిలో క్యాడర్‌కు అభ్యర్థుల అనుచరులకు గ్యాప్ వచ్చిందని జాతీయ నాయకత్వానికి నివేదిక పంపించారని సమాచారం. ఆయా ప్రాంతాల్లో స్థానిక కార్యకర్తలు, ప్రత్యర్థులవైపు మొగ్గు చూపారని, మరి కొందరు రెండవ ప్రాధాన్యత ఓటును బీఎస్పీ అభ్యర్థికి అనుకూలంగా వేశారని దీనికి ఖచ్చితంగా గెలుస్తామనుకున్న స్థానంలో గట్టిపోటీ ఎదుర్కోవలసి వస్తున్నదని జాతీయ నాయకత్వానికి నివేదించడంతో ఇక్కడ గెలుపుపై ఆ పార్టీకే విశ్వాసం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. దీనితో పోటీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మధ్యే ఉంటుందని అంచనా వేస్తున్నారు. పోలింగ్ రోజు కనిపించిన పరిస్థితులు ముక్కోణపు పోటీ జరుగుతున్నదని అభిప్రాయం కల్పించిన నేపథ్యంలో ఎవరు గెలుస్తారు... అన్నది తేలికగా చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ఉపాధ్యాయ స్థానంలో...

ఉపాధ్యాయ స్థానంలో అంచనాకు మించి పోలింగ్ జరుగడంతో విజయం ఎవరిని వరిస్తుందనేది స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డితో పాటు మరో 12 మంది పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా మల్క కొమురయ్య, వంగ మహేందర్‌రెడ్డికే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు అధికంగా ఓట్లు పోలైనట్లు ఆ పార్టీ చెబుతుండగా, ఇతర జిల్లాల్లో మహేందర్‌రెడ్డి కూడా గట్టి పోటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే బీజేపీ మాత్రం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి గెలుస్తామని ఉపాధ్యాయ స్థానంపై ధీమాతో ఉన్నది. ఈ ఫలితాలపై కూడా ఉపాధ్యా యవర్గాల్లో చర్చలు జోరుగా సాగుతున్నాయి.

పెన్షనర్స్‌కు వెంటనే బెనిఫిట్స్‌చెల్లించాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెన్షనర్స్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్‌రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లాఅధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, గౌరవ అధ్యక్షుడు కట్ట నాగభూషణచారి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో వారు మాట్లాడుతూ గతఏప్రిల్‌2024నుంచి ఇప్పటివరకు పదవీవిరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ కమ్యూటేషన్ వేల్యూఆఫ్‌పెన్షన్ జీపీఎఫ్, ఇతర బెనిఫిట్స్ ఇప్పటివరకు చాలామందికి మంజూరు చేయలేదన్నారు. పెన్షనర్స్‌ను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను మంజూరు చేయాలని కోరారు.





సేద తీరుతున్న అభ్యర్థులు

ఐదారు మాసాలుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా గడిపిన ప్రధాన పార్టీల అభ్యర్థులు పోలింగ్ ముగియడంతో సేద తీరుతున్నారు. కాగ్రెస్ అభ్యర్థి, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి శుక్రవారం విద్యార్థులతో సరదాగా గడిపారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణ కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి సరదాగా గడిపారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్



దుబ్బరాజన్న జాతరలో భక్తజన సందోహం

కన్నుల పండువగా దుబ్బరాజన్న రథోత్సవం

● భారీగా తరలి వచ్చిన భక్తులు

సారంగాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంబట్ల, కోనాపూర్ శ్రీ దుబ్బరాజన్న రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. రథం ముందు పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తులను ఉంచారు. భక్తులు శివనామ స్మరణలు చేస్తూ రథాన్ని ముందుకు కదలించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. డీఎస్పీ రఘు చందర్, సీఐకృష్ణరెడ్డి, ఎస్సై దత్తాద్రి బందోబస్తు నిర్వహించారు. రథం ముందు ఒగ్గు కళాకారుల, పోతురాజుల విన్యాసాలు, శివుని, నరసింహస్వామి వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయఈవో అనూష, చైర్మన్ శంకరయ్య, నాయకులు కొలుముల రమణ, గుర్రాల రాజేందర్‌రెడ్డి, కొండ్ర రాంచందర్‌రెడ్డి, బొడ్డుపెల్లి రాజన్న, ఆకులరాజిరెడ్డి, గుర్నాథం మల్లారెడ్డి, శేఖర్‌గౌడ్, ఆకుల రమేష్, తోట లక్ష్మణ్, దీటి వెంకటేష్, లింగన్న, సిబ్బంది, లక్ష్మీరాజం, రజినికాంత్,భక్తులు, తదితరులు పాల్గొన్నారు



పోతురాజుల ప్రదర్శనలు

కొండగట్టు ఆలయంలో టెండర్లు

మల్యాల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే పలు దుకాణాలకు అధికారులు శుక్రవారం టెండర్లు నిర్వహించారు. ఏడాది కాలపరిమితితో కొబ్బరి కాయల విక్రయం, కొబ్బరి ముక్కల ప్రోగు, పూలు, పండ్ల విక్రయం, గాజులు, ప్లాస్టిక్ వస్తువుల విక్రయం, పుట్నాలు, ప్యాలాల విక్రయం, హోటల్, ఫోటో స్టూడియో, సామాన్లు భద్రపరచుకునే హక్కు, స్నానాలు, మరుగుదొడ్లు, కిరాణం, కూల్‌డ్రింక్స్ ఐస్‌క్రీం, చెప్పులు భద్రపరచడం, వంట చెరుకు అమ్మకం కోసం ఈ-టెండర్, సీల్డ్ టెండర్,బహిరంగవేలం నిర్వహించారు. ఈవేలంలో కొబ్బరికా యల అమ్మకంకు రూ.1.50కోట్లు, పుట్నాలు, ప్యాలాల విక్రయం రూ.27.70లక్షలు, పూలు, పండ్ల విక్రయం రూ.40లక్షలు, గాజులు, ప్లాస్టిక్ వస్తువుల విక్రయం రూ.32లక్షలకు ఖరారు అయినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలి పారు. మిగితావి సరైన వేలం రాకపోవడంతో వాయిదా వేశామని, త్వరలోనే వాటికి మళ్లీ టెండర్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అయితే కాంట్రాక్టర్ల కుమ్మక్కుతో వేలం పెరగలేదని లేనిచో మరింత ఆదాయం సమకూరేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంలో పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్, చంద్రశేఖర్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

● ప్రజావాణిలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల వినతి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 28 (ఆంధజ్యోతి): విద్యుత్ సంస్థలోని ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ప్రజావాణిలో ఆర్టిజన్ కార్మికులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టిజన్ సంఘ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థలు ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌లో దాదాపు 20 వేల మంది ఆర్టిజన్‌లు గత ఏడు సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారన్నారు. అంతకు ముందు ఈ కార్మికులందరూ 15-20 సంవత్సరాలు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేశారు. ఆర్టిజన్‌లు అందరినీ విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని కోరుతూ గత 5 నెలల నుంచి నిరసనలు, రిలే నిరాహారదీక్షలు, కన్వర్షన్ యాత్రలు చేస్తూనే ఉన్నామన్నారు.

ఇదే విషయమై వినతిపత్రాలు సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ వజీర్, పవర్ ఎంప్లాయీస్ యునియన్ రీజినల్ అధ్యక్షుడు చందర్‌సింగ్ రాగూర్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని ప్రజావాణి వద్ద విద్యుత్ ఆర్టిజన్‌లు


పంటలను ముంచుతున్న కెనాల్ నీరు

● కాలువ లేక నష్టపోతున్నరైతులు ● పట్టించుకోని అధికారులు



మల్యాల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని మానాల శివారు నుంచి వెళ్లె ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ డీ-67 వచ్చే నీటితో మ్యాడంపల్లి శివారులో పంటలకు నష్టం వాటిల్లుతోంది. కాలువ నీరు సరైన మార్గం లేక పంటల నుంచి వెళ్తుండడంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. మండలంలోని మానాల నుంచి తక్కళ్లపల్లితో పాటు పెగడపల్లి మండలంలోని పలు గ్రామాలకు డీ-67 ఉప కాలువ ద్వారా నీరు వెళ్తుంటాయి. అయితే మ్యాడంపల్లి శివారులో ఉపకాలువ ద్వారా సమీప పెద్ద చెరువులోకి నీరు మళ్లిస్తుంటారు. దీని కింద సుమారు వంద ఎకరాల ఆయకట్టు ఉంది. గుట్టలకు కాంటూరు కందకాల తవ్వ కంతో ఈ చెరువులోకి నీరు కొన్ని ఏళ్ల క్రితమే నిలిచి పోయింది. దీంతో ఉప కాలువ నుంచి నీటిని చెరువులోకి మళ్లిస్తున్నారు. పెద్ద చెరువులోకి నీరు తరలించడానికి ప్రత్యేక మార్గం లేకపోవడంతో రైతుల పంటల నుంచి వెళ్తున్నాయి. దీంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది.

ఉప కాలువ నుంచి పెద్ద చెరువు మధ్యలో కేవలం 400 మీటర్ల మేర సీసీతో కాలువ నిర్మిస్తే చెరువులోకి నీరు వెళ్లే అవకాశం ఉంది. అయితే ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. పొలాల నుంచి నీరు వెళ్లకుండా తగు చర్యలు తీసుకొని పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



మామిడి తోట నుంచి, సాగు చేసిన పంటల్లో కాలువ నీరు

శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు



మాట్లాడుతున్న కుతాడి శివరాజ్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడ చూసినా కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలంగాణ లేబర్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు కుతాడి శివ రాజ్ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో తెలంగాణ లేబర్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల రక్షణ కోసమే తెలంగాణ లేబర్‌యూనియన్ ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో వలసకార్మికులు రావడంతో స్థానిక కార్మికులకు ఉపాధికరువైందన్నారు. కేంద్రం కార్మికచట్టాలను చిత్తుకాగితంలా మార్చిందని మండిపడ్డారు. కార్మికల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన చట్టాలు అమలయ్యే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్‌ఉపాధ్యక్షురాలు మొగురంమీరియా, జిల్లాఅధ్యక్షుడు కాశిపాక అజయ్, మంచిర్యాలజిల్లా అధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు జగ్గబుంల లలిత, గందేకొమురయ్య, చిప్పకుర్తి లలిత, పెర్క కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటమే మిగిలింది..

(5వ పేజీ తరువాయి)

వినియోగదారులకు ఎదురవుతోంది. రైతుబజార్‌లో షెడ్లు ఉన్నప్పటికి అనువుగా లేకపోవడంతో రైతుబజార్‌లోని రోడ్లపైనే రైతులు కూర్చొని అమ్మకాలు సాగిస్తున్నారు.

38 కూరగాయలు, 34 మాంసం దుకాణాలు

మోడల్ రైతుబజార్‌లో రైతులు కూర్చోవడానికి వీలుగా, విక్రయాలకు అనువుగా దుకాణాలను నిర్మించారు. 38 కూరగాయల దుకాణాలు, 34 మాంసం విక్రయ దుకాణాలకు కేటాయించారు. పండ్లు, పూలకు ప్రత్యేక దుకాణాలు నిర్మించారు. రైతులకు, వినియోగదారులు ఉపయోగించే విధంగా మరుగుదొడ్లు, మినరల్ వాటర్ సౌకర్యం కల్పించారు. మున్సిపల్ నిర్లక్ష్యానికి మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడడమే కాకుండా ఇప్పటివరకు మాంసం దుకాణాలు ప్రారంభం కాలేదు. అర్థీ వ్యాపారులు మాత్రం దుకాణాలు తీసుకొని తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. రైతులు మాత్రం రోడ్లపైన ఇబ్బందులు పడుతూ తాము తెచ్చిన కూరగాయలను అమ్ముకొని వెళ్తున్నారు.

ఆకట్టుకుంటున్న ప్రతిమలు.. వెక్కిరిస్తున్న పిచ్చిమొక్కలు

సిరిసిల్ల రైతుబజార్‌లో రైతు ప్రతిమలతో పాటు కూరగాయలు, చేపలు, పండ్లు వంటి ప్రతిమలు వినియోగదారులు ఆకర్షిస్తున్నా సిరిసిల్ల బల్దియా పట్టించుకోకపోవడంతో మార్కెట్‌లో పిచ్చిమొక్కలతో ప్రతిమలు కనబడకుండా వెక్కిరిస్తున్నాయి. సిరిసిల్లలోని మోడల్ రైతు బజార్‌లో నిర్మించిన షెడ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. షెడ్లు పెచ్చులూడుతున్నాయి. దీంతో రైతులు షెడ్లలో కూర్చోవడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలిచిన మోడల్ మార్కెట్ నిర్వహణ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ఘనంగా బద్ది పోచమ్మ బోనాలు

రుద్రంగి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలం మానాలలో బద్ది పోచమ్మఅమ్మవారి బోనాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏటా శివరాత్రి జాతర తెల్లవారి బద్ది పోచమ్మ బోనాలు తీయడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో మానాల గ్రామంలో ప్రతి ఇంటి నుంచి పోచమ్మకు బోనాలు సమర్పించి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య, మాజీ సర్పంచ్ అల్లూరి మానాస, నాయకులు జక్కు మెహన్, బాదనవేణి రాజరాం, జక్కు వంశీ, రవీందర్, దిలీప్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్ నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- కూరగాయల వ్యాపారులకు తప్పని ఇబ్బందులు - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలో సమీకృత మార్కెట్ నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఫలితంగా కూరగాయల వ్యాపారులు ఎండలో ఎండుతూ వానలో తడుస్తూ రోడ్డుపైన కూరగాయల క్రయవిక్రయాలు జరుపుతున్నారు. వేసవి కాలం సమీపించడంతో కూరగాయల వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. గత పాలకులు సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం పాత కూరగాయల మార్కెట్‌ను, పక్కనే ఉన్న పాత గ్రామపంచాయతీ భవనాన్ని కూల్చివేశారు. కొత్త మార్కెట్‌ను నిర్మించక ముందే సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడం, ఎన్నికల కోడ్ రావడంతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి బ్రేక్ పడింది. దాదాపు ఏడాది దాటినా సమీకృత మార్కెట్ నిర్మాణం ఊసే లేకపోవడంతో కూరగాయల వ్యాపారులు నానా అవస్థలు పడుతున్నారు. కూరగాయలు అమ్మడానికి ఆయా గ్రామాల నుంచి వందకు పైగానే రైతులు వస్తుంటారు. కూరగాయల విక్రయాల కోసం ప్రతి రోజు ఒక్కొక్కరికి వద్ద గ్రామపంచాయతీ నుంచి 20 రూపాయలను వసూలు చేస్తారు. మూత్రశాల సౌకర్యం కూడా లేకపోవడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి వసతులు లేకున్నా గ్రామ పంచాయతీకి కూరగాయలు అమ్మే ప్రతి రైతు 20రూపాయలు చెల్లించాల్సిందే. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమీకృత మార్కెట్ నిర్మాణానికి చరవ చూపాలని వ్యాపారులు కోరుతున్నారు.



గంభీరావుపేటలో రోడ్డుపైన కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

ఎండలో ఎండుతూ.. వానలో తడుస్తున్నాం..

- నారాయణ, కూరగాయల వ్యాపారి



ఎండలో ఎండుతూ వానలో తడుస్తూ కూరగాయల వ్యాపారం చేస్తున్నాం. మార్కెట్ లేకపోవడంతో నడి రోడ్డుపై కూరగాయలను అమ్ముకుంటున్నాం. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ కూరగాయల వ్యాపారం చేస్తున్నాం. ఇప్పటికైనా నాయకులు, అధికారులు పట్టించుకోవాలి. త్వరగా మార్కెట్‌ను నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలి.

సమీకృత మార్కెట్‌ను త్వరగా నిర్మించాలి..

- దోసల చంద్రం, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు



గంభీరావుపేటలో సమీకృత మార్కెట్ నిర్మాణం త్వరగా చేపట్టాలి. పాతమార్కెట్ కూల్చడంతో కూరగాయల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల వ్యాపారులకు కనీస వసతులు లేవు. ప్రస్తుతం ఎండాకాలం సమీపించడంతో కూరగాయల వ్యాపారులకు మూత్రశాలలతో పాటు తాగు నీటి సౌకర్యం కల్పించాలి.

డ్రైనేజీ పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరు గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులను బీజేపీ నాయకుడు గుంటి మహేష్ శుక్రవారం ప్రారంభించారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరుచేశారు. కార్యక్రమంలో బూత్‌కమిటీ అధ్యక్షుడు చక్రాల కార్తీక్, నాయకులు గుంటి అనీల్, రమేష్, మహేందర్, వెంకటేష్, శేఖర్, అనీల్, అరవింద్, రాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

చందుర్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చందుర్తి గ్రామ గాయత్రి విశ్వబ్రహ్మణ సంఘం నూతన కార్యవర్గంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలుముల హన్మయ్యచారి, ఉపాధ్యక్షుడిగా రాజూరి బ్రహ్మచారి, కార్యదర్శిగా రాజూరి రవీందర్ చారి,కోశాధికారి రాజూరి విష్ణు కుమార్‌చారిలను ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు రాజూరి శ్రీకాంత్ చారి, గోవిందా చారి,రాజేందర్, మహేష్ సద్గుణచారి, రఘురామ్, అరుణ్, సందీప్, సాయి కృష్ణలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన బోడిగె రాములుకు సీఎం సహాయనిధి చెక్కును కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుడికందుల సురేందర్‌రెడ్డి శుక్రవారం అందించారు. రాములు అనారోగ్యానికి గురికాగా సీఎం సహాయనిధి ద్వారా రూ17,500 మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో నాయకులు బొడిగె తిరుపతి, మంద రవి, బొడ్డు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బియ్యం వితరణ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ కేంద్రానికి బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి శుక్రవారం 25 కిలోల బియ్యం వితరణ చేశారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, గణేశ్, జితేందర్‌రెడ్డి, కిరణ్‌నాయక్, దయాకర్, సృజన్, వినయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరుకు కృషిచేయాలని ప్రెస్‌క్లబ్ సభ్యులు కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు నర్సయ్యలను కోరారు. శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, గౌస్, బాబు, చందు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచర్లగొల్లపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో చికిత్స పొందుతున్న బీజేపీ కార్యకర్తలు దాసరి శ్రీకాంత్, శెట్టిపల్లి కిష్టయ్యలను పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, బీఆర్ఎస్ నాయకుడు పెంజర్ల చిన్న మల్లయ్యలను పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలు శుక్రవారం వేర్వేరుగా పరామర్శించారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు రాజిరెడ్డి, తిరుపతి, లక్ష్మారెడ్డి, స్వామి, యాదగిరి, వంశీ, కుమార్, జితేందర్‌రెడ్డి, శ్రీశైలం, గణేశ్, లక్ష్మణ్, సుభాష్, రమేశ్, రాజునాయక్, తిరుపతినాయక్, కల్యాణ్‌నాయక్, పెంటయ్యనాయక్, ప్రభునాయక్ ఉన్నారు.

రాజిరెడ్డిని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ నేతలు, సామాన్య రైతులపై అక్రమ కేసులు పెడితే సహించబోమని, కేసులు మానుకోకపోతే జైలు భరో చేపడుతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. జైలు నుంచి వచ్చిన తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన రైతు అబ్బాడి రాజిరెడ్డిని శుక్రవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లిరామ్మోహన్, సింగిల్ విండోచైర్మన్లు బండి దేవదాస్, కోడూరి భాస్కర్‌గౌడ్, మాజీ ఎంపీఈ పడిగెల మానస, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, అంకారపు రవీందర్, మాట్ల మధు, వేణుగోపాల్ రావు, వెంకటరమణారెడ్డి, పడిగెల రాజు తదితరులు పరామర్శించారు. రాజిరెడ్డికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అక్రమ కేసులు రైతులను వేధించడం సరైందికాదని, అక్రమ కేసులు మానుకోవాలని కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గంగాధర్ ఒక ప్రకటనలో కోరారు. 6వ తరగతిలో 100 సీట్లు, మిగిలిన తరగతుల్లో ఖాళీ సీట్లకు మార్చి 10వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వం ఇప్పటికే గడువు పొడిగించినందున తల్లిదండ్రులు గమనించాలన్నారు.

● బోయినపల్లి : తెలంగాణ మోడల్ స్కూల్ బోయినపల్లిలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో 100 సీట్లకు, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మార్చి 10వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 13న ఆరో తరగతి వారికి ఉదయం 10 నుంచి 12వరకు ఉంటుందని, 7,8,9,10 తరగతుల వారికి మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు ఉంటుందన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



సిరిసిల్ల నెహ్రూనగర్ పాఠశాలలో సీవీ రామన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పెద్దూర్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్



ఇల్లంతకుంటలో..

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం విద్యార్థులు సైన్స్ ప్రయోగాల ప్రదర్శనలు నిర్వహించారు. నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. సిరిసిల్లలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం నాగుల భాగ్యరేఖ పర్యవేక్షణలో వేడుకలు నిర్వహించారు. నెహ్రూనగర్ మండల పరిషత్ పాఠశాలలో 50 సైన్స్ ప్రదర్శనలు హెచ్ఎం గణేష్, ఉపాధ్యాయులు శైలజ, హరిప్రసాద్, రఫీయోద్దీన్, నందిని, త్రివేణి పర్యవేక్షణలో విద్యార్థులు ప్రదర్శించారు. అంబేద్కర్‌నగర్ జడ్పీ పాఠశాల ఆవరణలో విభిన్నమైన కార్యక్రమాలతో సైన్స్ వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం పోలాస మల్లేశం, ఉపాధ్యాయులు సామల రమాదేవి, సత్యనారాయణ, రవికుమార్, రవీందర్, రమాదేవిల పర్యవేక్షణలో ప్రదర్శనలు జరిగాయి. పెద్దూర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని హెచ్ఎం చక్రవర్తుల రమాదేవి, రవికుమార్, రవీందర్, శ్రీనివాస్, మాధవి, ఉమ, వాణిశ్రీ, కల్పన, వీణ, శంకర్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన అలరించింది. నెహ్రూనగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సైన్స్ టీచర్ భాగ్యలక్ష్మీల ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ పరికరాలను ప్రదర్శించారు. సైన్స్ మేళా అలరించింది. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల జడ్పీ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం అనూరాధ, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, రమేష్, లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, సాయి ప్రణీత్, శారద, శైలజ, శిరీష, నీరజ, సమత, తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో జాతీయ సైన్స్‌దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్, వాణీనికేతన్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులు ప్రేమలత, తూముకుంట శ్రీనిధిలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండలంలోని లింగన్నపేట, దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సైన్స్ సబ్జెక్ట్‌పై విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు, ఉపన్యాస పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గంగారాం మాట్లాడారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, వెంకటాపూర్, తిమ్మాపూర్, గుండారం, బండలింగంపల్లి, తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో మొట్టమొదటి జాతీయ శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రయోగాలను వివరించారు. ఎంఈవో కృష్ణహరి ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ వర్కింగ్ మోడల్స్, డ్రాయింగ్ పోటీలు, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. సనుగుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు జితేందర్, ముఖేష్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, పావని బాలరెడ్డి, జాకీర్, మహేష్, బన్నాజీ, ఈగ శ్రీనివాస్, అనిత పాల్గొన్నారు.

● వీర్నపల్లి : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గర్జనపల్లి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన వివిధ పరికరాలను ప్రదర్శించి, ప్రయోగాలను నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు వెంగల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి, ప్రేమ్ సాగర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, బలరాం, మంజుల, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో..



వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో..

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

- భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు పేర్కొన్నారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతు కార్మికులకు అనుకూలంగా ఉన్న 44 కార్మిక చట్టాలను ఎత్తివేసి నల్లచట్టాలను తీసుకవచ్చిందని విమర్శించారు. లేబర్‌కార్డు ఉన్న 55సంవత్సరాల కార్మికులకు రూ 5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెస్‌డబ్బులను సంక్షేమ బోర్డులోని ఇతర అవసరాలకు వినియోగించవద్దన్నారు. సమావేశంలో గ్రామశాఖ అధ్యక్షుడు మారుపాక రామస్వామి, ఉపాధ్యక్షుడు జక్కనపల్లి రవి, ప్రధానకార్యదర్శి దప్పుస్వామి, నాయకులు మల్లమారి అంతగిరి, కొత్తపల్లి రవిచారి, నక్క రవి, మల్లమారి కనకరాజు, చంద్రమౌళి, ఎల్లయ్య, గంగాధర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం

- మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాములు



మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాములు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ శనివారం నిర్వహించే అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని వర్గాల వారు హాజరై విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో అధికారం చెపట్టిన బీజేపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్న భగత్‌సింగ్, బీఆర్ అంబేద్కర్ ఫొటోలను తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ శనివారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. దేశం స్వాతంత్ర్య కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ భారత చరిత్రకారులను కనుమరుగు చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఈ చర్యను మేధావులు, ప్రజా సంఘాలు వ్యతిరేకించాలన్నారు. సర్వమతాలతో సామరస్యంగా ఉన్న దేశంలో మనువాద పార్టీలు బీజేపీ అనుబంధ ఆర్ఎస్ఎస్ మనువాదాన్ని ప్రోత్సహిస్తున్నాయన్నారు. మతసామరస్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మనువాద రాజ్యాంగ ప్రజ్యాతిరేక విధానాలను అందరు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా శనివారం జిల్లాకేంద్రంలో అఖిల పక్షం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామన్నారు. సమావేశానికి అన్ని వర్గాల వారు రావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సిరిసిల్ల సంజీవయ్యనగర్ యువజన సంఘం అధ్యక్షుడు కొంపెల్లి విజయ్‌కుమార్, నాయకులు పండుగ రవి, సిరిగిరి రవి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకునేలా అంగన్‌వాడీ సిబ్బంది సరైన సూచనలు చేయాలని సీడీపీవో ఉమారాణి పేర్కొన్నారు. మండలంలోని కందికట్కూర్, ఇల్లంతకుంట సెక్టారులలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కేంద్రానికి ప్రతిరోజు ఎంతమంది వస్తున్నారు, తదితర అంశాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం నేటి సమాజంలో బాలికలు, మహిళలపై దాడులు పెరుగుతున్నందున వాటి నుంచి ఎలా రక్షణ పొందాలో వివరించారు. ప్రతి ఒక్కరికి గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రాజు, దేవిక, సూర్యకళలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి..

వీర్నపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వీర్నపల్లి మండల తెలంగాణ సాంస్కృతిక శాఖ మండల అధ్యక్షుడు నేరళ్ల ముత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఉద్యమ కళాకారుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా తమ డిమాండ్లను రాసి పంపారు. ఈ కార్యక్రమంలో దర్శనాల లింబాద్రి, భూత అంజయ్య, బోయిని రవి, వీటూరి సతీష్, దేవయ్య, నాగరాజు, జనార్ధన్, పర్శరాములు, చంద్రమౌళి, గణేష్, అన్నారం జనార్ధన్, జంగం అంజయ్య, దాసరం నారాయణ, దేశరాజు సత్తయ్య, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో కళాశాలలో అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సిరిసిల్ల అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవించినపుడు ఉపయోగించే పరికరాలు, చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్‌అధికారి ఎన్ నరేందర్, నర్సింహాచారి, గణేష్, ప్రవీణ్‌కుమార్, సాబీర్, సాయికిరణ్‌లు పాల్గొన్నారు.

● వేములవాడ : వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక విభాగం అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రంలో ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు వేములవాడ అగ్నిమాపక అధికారి అనిల్ కుమార్ తెలిపారు. అధ్యాపకులకు, విద్యార్థులకు అగ్ని ప్రమాదం గురించి సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు మహేందర్, అశోక్, సంతోష్, దేవయ్య, అంజయ్య, శ్రీనివాస్‌రావు, స్వప్న, జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా నిలుస్తాం..

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



దేవునిగుట్టతండాలో ఎండిపోయిన పొలాన్ని పరిశీలిస్తున్న ఆగయ్య తదితరులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : వరిపొలాలు ఎండిపోయి ఆందోళన చెందుతున్న అన్నదాతలకు అండగా నిలబడుతామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో ఎండిపోతున్న వరి పొలాలను స్థానిక నాయకులు, రైతులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అప్పులు చేసి పంట సాగు చేస్తే నీరందక ఎండిపోతోందని పలువురు రైతులు వాపోయారు. మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ 15 రోజులుగా భూగర్భ జలాలు అడుగంటి సాగు చేసిన వరి పొలాలు ఎండిపోయి రైతులు గోసపడుతున్నారన్నారు. ఎండిన వరి చేన్లల్లో పశువులను మేపాల్సిన వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ హయంలో సాగు, తాగు నీటిని అందించి ఆదుకుందన్నారు. పంట పొలాలు ఎండిపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం రైతాంగం పట్ల ఉన్న తీరును అన్నదాతలు గమనిస్తున్నారని అన్నారు. శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి మల్కపేట జలాశయం వరకు నీటిని ఎత్తిపోసి ఎగువ ప్రాంత రైతులకు సాగు నీరు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన నిలబడి ఉద్యమిస్తామని ఆగయ్య తేల్చి చెప్పారు. ఆయన వెంట ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు సుభాష్, రమేశ్, శ్రీనివాస్, పెంటయ్య, రాజునాయక్, తిరుపతినాయక్, ప్రభునాయక్, కల్యాణ్, మురళీమోహన్, రైతులు ఉన్నారు.